అందని ఉపాధి వేతనాలు

- ఉదయగిరి నియోజకవర్గంలో రూ.15.83కోట్ల బకాయిలు
- 15 వారాలుగా జమకాని వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దుత్తలూరు: ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా 15వారాలుగా వేతనాలు ఖాతాల్లో జమకాకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోయినా, అదనపు భత్యం అందించకపోయిన నాలుగు రూపాయలు వస్తాయనే ఆశతో కూలీలు శ్రమకోర్చి పనులకు వెళ్లారు. అయితే నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ఉపాధి కార్మికులు మండిపడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించేవారు. అందుకు భిన్నంగా నేటి కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తూ మూడు నెలలు గడిచిన ఉపాధి వేతనాలు కూలీల ఖాతాల్లో జమచేయ లేదు. మరోవైపు రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే అందజేస్తుండడంతో ఇతర నిత్యావసర సామగ్రి బయట దుకాణాల్లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ఉపాధి కూలీలు కడుపు నింపుకొనేందుకు అవస్థ పడుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలో 62,478 జాబ్ కార్డులు ఉన్నాయి. నిత్యం 98,454 మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. వీరికి 15 వారాలుగా వేతనాలు చెల్లించలేదు. సుమారు రూ.15.83 కోట్ల వేతన బకాయిలు ఉన్నాయి. ఉపాధి వేతనాలు ఎప్పుడు అందుతాయో కూడా అధికారులకు తెలియని పరిస్థితి. ఉపాధి కూలీలు అధికారులను అడిగితే తాము చేయాల్సిన ప్రక్రియ పూర్తయిందని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే ఖాతాల్లో జమవుతాయని చెబుతున్నారే తప్ప ఎప్పుడు పడతాయో నిర్దిష్టంగా చెప్పేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఉపాధి కార్మికులు ఉపాధి పనులపై ఆసక్తి కనబరచడం లేదు. మరోవైపు బినామీ మస్టర్లతో కూడా తాము నష్టపోతున్నామని కూలీలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



మూడు నెలలుగా ఉపాధి పనులకు వెళ్తున్నా. ఇంత వరకు నగదు పడలేదు. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే అందజేయాలి.

– రమణమ్మ, ఉపాధి కూలీ, ముత్తరాచుపల్లి, దుత్తలూరు మండలం

బకాయిలు విడుదల చేయాలి



ఉపాధి కూలీలతో పనులు చేయించుకుని నగదు విడుదల చేయకుండా జాప్యం చేయడం తగదు. ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి. కూలీలకు కనీస వేతనం రూ.600 చెల్లించాలి. ప్రతి కుటుంబానికి 200 రోజుల పని దినాలు కల్పించాలి.

– గుజ్జుల మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి, దుత్తలూరు

ఖాతాల్లో జమవుతాయి



ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే వారి వ్యక్తిగత ఖాతాల్లో జమవుతాయి. ఉపాధి కూలీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు. మరికొద్ది రోజుల్లో పడేఅవకాశం ఉంది.

–మృదుల, ఏపీడీ, ఉదయగిరి

క్లుప్తంగా

బంగారు ఆభరణాల బహూకరణ



సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన దాతలు కోటు సుధాకర్‌రెడ్డి, వాయుసుధ దంపతులు 49 గ్రాముల బంగారు ఆభరణాలను బహూకరించారు. సుమారు రూ. 5.60 లక్షల విలువైన సంగమేశ్వరస్వామికి త్రినేత్రంతో కూడిన నామాలు, అమ్మవారికి బొట్టు, ముక్కెరను అందజేశారు. వీటిని దాత కుటుంబ సభ్యుడు కోటు కరుణాకర్‌రెడ్డి ఆలయ ఈఓ రఘురామయ్యకు సోమవారం అందజేశారు.

భీమేశ్వరాలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



సంగం: వంగల్లులోని భీమేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ పగడాల రఘురామయ్య, సభ్యులతో ఆలయ ఈఓ రఘురామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్ పగడాల రఘురామయ్య మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. వవ్వేరు గ్రూపు దేవస్థానాల చైర్మన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



కలిగిరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ చైర్మన్‌గా ఉదయగిరి నియోజక వర్గ బీజేపీ ఇన్‌చార్జి కదిరి వెంకటరంగారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే సభ్యులుగా గన్నమనేని శ్రీనివాసులునాయుడు, సోము భాస్కర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలు



సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులు దుత్తలూరుకు చెందిన సీడ్స్ స్వచ్ఛంద సంస్థ అందజేసే యువఅన్‌స్టాపబుల్ ఉపకారవేతనాకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం బుజ్జయ్య విద్యార్థులకు ఉపకారవేతన మంజూరుపత్రాలను అందజేసి అభినందించారు. విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.2 లక్షలు చొప్పున ఉపకారవేతనాన్ని మంజూరు చేసేందుకు ముందుకొచ్చిన సీడ్స్ సంస్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: అనంతసాగరం మండలం కచిరిదేవరాయపల్లి ఎస్సీ కాలనీకి చెందిన చిన్నారులు అచ్చి, పావలకు వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ ప్రణీత్ సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. చిన్నారుల తల్లి మృతి చెందగా, తండ్రి వదిలేసి వెళ్లాడు. చిన్నారుల ఆలనాపాలన చూడడం కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే నాయనమ్మ అంకమ్మకు కష్టంగా మారింది. ఈ విషయం కొప్పోలు వెంకటేశ్వర్లు ద్వారా తెలుసుకున్న డాక్టర్ ప్రణీత్ తన ట్రస్టు ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ట్రస్టు సభ్యులు డాక్టర్ వెంకట సందీప్, డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ పాల్గొన్నారు

నేడు మండల సర్వసభ్య సమావేశం

సోమశిల: అనంతసాగరం మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సోమవారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సంపూర్ణమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అన్నదాత సుఖీభవకు మరో అవకాశం

అనుమసముద్రంపేట: అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఏఓ సురేష్‌బాబు సోమవారం తెలిపారు. అర్హత కలిగి ఉండి ఇంతవరకు దరఖాస్తు చేసుకోని రైతులు రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలని సూచించారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం



మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై దేవదేవేరుల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఆత్మకూరు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కంభం విజయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

ఉదయగిరి రూరల్: మండలంలోని సున్నంవారిచింతలలో జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. యువత ఉత్సాహంగా ఉట్టికొట్టారు.

వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి



కావలి (జలదంకి): గర్భిణులు, బాలింతలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలని కావలి ఏడీఎం హెచ్‌ఓ బ్రిజిత అన్నారు. పట్టణంలోని ఇందిరా నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటూ సరైన ఆరోగ్య జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్‌లు వేయించాలన్నారు. అనంతరం బాలింతలకు ఐరన్, కాల్షియం సిరప్‌లు పంపిణీ చేశారు. వెంగళరావునగర్ యూహెచ్‌సీ వైద్యుడు మహేష్, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజికకార్యకర్త మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ కళావతి పాల్గొన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.205

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలంలో కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు సగటు ధర రూ.205 లభించింది. వేలానికి 295 బేళ్లు రాగా, 174 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.140, సగటున రూ.205.84 ధర పలికిందని వివరించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ఉదయగిరి: స్థానిక విద్యావనరుల కేంద్రంలో మెసెంజర్ షేక్ నవాజీను అధికారులు, సహచర సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. నెల్లూరులో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కారం అందుకోవడంపై అభినందించారు. తహసీల్దార్ ఎల్. రామ్మోహన్, ఎంపీడీఓ అప్పాజీ, ఎంఈఓలు మస్తాన్‌వలి, టీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కంకరపరిచారు..వదిలేశారు



కొండాపురం : మండలంలోని ఆదిమూర్తిపురం–గరిమెనపెంట రోడ్డును పలుచోట్ల మరమ్మతుల పేరుతో తవ్వేసి కంకరపరిచారు. ఆ తరువాత తారువేయకుండా వదిలేశారు. దాదాపు తొమ్మిది నెలలుగా అలాగే వదిలేయడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు నరకాన్ని చవిచూస్తున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు అదుపుతప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఈ మార్గంలో బస్సులు లేవు. ఆటోలే దిక్కు. రోడ్డు అధ్వానంగా ఉండి ఆటోలు రాకపోతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్లపై తట్ట మట్టి కూడా వేయలేదని, తాము అధికారంలోకి రాగానే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టి అధికారంలోకి వచ్చి కూటమి ప్రభుత్వం మరమ్మతుల పేరుతో రోడ్డును తవ్వి వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి



రామలింగేశ్వరస్వామి ఆలయ పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అల్లూరు: రామలింగేశ్వరస్వామి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి నూతన పాలకమండళ్లు కృషి చేయాలని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. నార్త్‌మోపూరులోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, ఇందుపూరులోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో నూతన పాలక మండళ్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా రేబాల కిషోర్‌రెడ్డి, సభ్యులుగా ఎం సంధ్య, బీ కొండమ్మ, పీ శ్రీనివాసులు, డీ గోపాలయ్య, పీ వెంకటేశ్వర్లు, కే బాలయ్య, బీ పెంచలమ్మ, బీ కవిత ప్రమాణ స్వీకారం చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా గుణపాటి ఫణి రెడ్డి, సభ్యులుగా వై భారతమ్మ, ఆర్ ప్రభావతమ్మ, డీ వెంకటేశ్వర్లు, జీ వెంకటరత్నమ్మ, డీ కృష్ణయ్య, పీ విమల, వీ రత్నాకర్, సీహెచ్ నాగమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి కోటారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, నాయకులు రేబాల శంకర్‌రెడ్డి, హరికృష్ణ, రాజేంద్ర, కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఏఎంసీ చైర్మన్‌గా ఆరికట్ల

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా ఆరికట్ల జనార్దన్‌నాయుడు, వైస్‌చైర్మన్‌గా గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పాలకవర్గ సభ్యులుగా ఇండ్ల శ్రావణి, రోశమ్మ, పెంచలయ్య, లక్ష్మిరెడ్డి, బాలమ్మ, దేవరాల గంగాధర్, బంకా సుబ్బారెడ్డి, నంది ప్రభావతి, షేక్ షర్మిల, హేమలత, ఉక్కాల శ్రీనివాసులు, బుజ్జమ్మ, బత్తల కృష్ణయ్యను నియమించింది.

కూలేందుకు సిద్ధంగా..



కొండాపురం : మండలంలోని గుడవళ్లూరు పొలాల్లో 11కేవీ విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. మర్రిగుంట నుంచి రేణమాల వెళ్లే 11 కేవీ లైన్‌కు సంబంధించిన ఈ స్తంభం ఏ క్షణంలో కూలుతుందో..ఏం ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళనలు చెందుతున్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని వారు కోరుతున్నారు.

ముఖద్వారాల నిలుపు



కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో గ్రామదేవతలు పోలేరమ్మ, అంకమ్మతల్లి ఆలయాల నిర్మాణంలో భాగంగా ముఖద్వారాల నిలుపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మహిళలు ముఖద్వారాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సురేష్‌బాబు సోమవారం తెలిపారు. మండలంలో అర్హత కలిగి ఉండి ఇంత వరకు దరఖాస్తు చేసుకోని రైతులు ఈ నెల 20లోగా రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మైనింగ్‌కు అనుమతులు నిలిపివేయాలని వినతి



వరికుంటపాడు: మండలంలోని భాస్కరపురం, జంగంరెడ్డిపల్లి గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 233–1లోని సుమారు 16 హెక్టార్లలో క్వార్ట్జ్ మైనింగ్‌కు అనుమతులను నిలిపివేయాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మైనింగ్‌తో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, మైనింగ్‌ను అనుమతులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సబ్‌కలెక్టర్ తాను కొత్తగా బాధ్యతలు స్వీకరించానని, సమస్యను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరికుంటపాడు సర్పంచ్ కొండేపోగు దిలీప్, హ్యూమన్ రైట్స్ సభ్యులు వెంకటమోహన్, షరాబు చంద్ర, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మేం వచ్చిందే సమయం



తెరుచుకోని వ్యవసాయ శాఖ కార్యాలయం

దుత్తలూరు: మండలాధికారులు సమయాన్ని పాటించడం లేదు. మేం వచ్చిందే సమయమన్నట్లుగా కార్యాలయాలకు వస్తున్నారు. సోమవారం పలు కార్యాలయాలకు చెందిన అధికారులు, సిబ్బంది 12 గంటలు దాటినా రాకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెలుగు కార్యాలయంలో అకౌంటెంట్ తప్ప మిగిలిన వారు హాజరుకాలేదు. అలాగే ఉపాధి కార్యాలయంలో బీఎఫ్‌టీ తప్ప ఇతర సిబ్బంది రాలేదు. వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని అసలు తెరవనేలేదు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికకు కూడా కొందరు రెవెన్యూ సిబ్బంది, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ కూడా సమయానికి రాలేదు. వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చినప్పటికీ అధికారులు, సిబ్బంది సమయానికి రాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



సంగం: మండలంలోని దువ్వూరులో అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

తహసీల్దార్‌కు సన్మానం



సంగం: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్‌ను కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. నెల్లూరులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విశిష్ట సేవాపురస్కారాన్ని అందుకోవడంపై తహసీల్దార్‌ను శాలువా,పూలమాలతో సత్కరించి అభినందించారు.

వ్యక్తిపై దాడి

ఉదయగిరి: మండలంలోని సంజీవరాజుపల్లి వద్ద శ్రీనివాసులు అనే వ్యక్తిపై కొందరు సోమవారం దాడికి పాల్పడ్డారు. వివరాలు..సీతారామపురానికి చెందిన పసుపులేటి శ్రీనివాసులు హైర్స్ సామగ్రిని తీసుకుని ఉదయగిరి వెళ్తూ సంజీవరాజుపల్లి వద్ద ఆటోను ఆపాడు. అదే మార్గంలో సురేంద్ర, వంశీ, సాయి కారులో వెళ్తూ హైర్స్ ఆటోను ఢీకొన్నారు. దీంతో ఇరువురి మధ్యన వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో తనపై సురేంద్ర, వంశీ, సాయి దాడికి పాల్పడ్డారని శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఇంద్రసేనారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ఉలవదిబ్బలో ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ పరిచయ కార్యక్రమాన్ని ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి హసన్‌బేగ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్‌గా సయ్యద్ మున్వర్, ఉలవదిబ్బ ఇన్‌చార్జిగా నగ్మా, 14వ వార్డ్ ఇన్‌చార్జిగా సలాం, 15వ వార్డు ఇన్‌చార్జిగా ఉమ్మి సహాని, తదితరులను ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షకూర్ పాల్గొన్నారు.

వలంటీర్ నియామకానికి ఆర్థిక సాయం

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడాన్ని హెచ్‌ఎం గాజులపల్లి సుబ్బారెడ్డి గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లగా పూర్వ విద్యార్థి పాలకొండ వెంకటేష్ స్పందించారు. ఏడాదిపాటు విద్యావలంటీరు నియామకానికి అవసరమైన రూ.60 వేలు వేతనాన్ని సోమవారం అందజేశారు.

అక్రమ అరెస్టులు హేయం

ఉదయగిరి: కరేడులోని వ్యవసాయ భూములను ఇండోసోల్ కంపెనీకి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా, రైతు కూలీ సంఘాలు చేపట్టిన చలో కరేడు కార్యక్రమాన్ని అణచివేసేందుకు నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం హేయమని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య ఖండించారు. మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరేడులో ఏడాదికి మూడు కారుల పంటలు పండే 8 వేల ఎకరాల వ్యవసాయ భూములను కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయించడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం దిగి రాకపోవడంతో ప్రజా, రైతు కూలీ సంఘాలు చలో కరేడు కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. అయితే చలో కరేడును అణచివేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం, ముందస్తు నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని చూడడం మంచి పద్ధతి కాదన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన సీపీఎం, ప్రజా సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతు సంఘ నాయకులు మస్తాన్‌రెడ్డి, కేశవ్, తదితరులు ఉన్నారు.

సీపీఎం నేతల అరెస్ట్‌పై ఆందోళన

ఆత్మకూరురూరల్: చలో కరేడు కార్యక్రమానికి వెళ్లిన సీపీఎం నాయకులను అరెస్ట్ చేసి ఓలేటివారిపాళెం పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని నిరసిస్తూ ఆత్మకూరులో ఆ పార్టీ శ్రేణులు సోమవారం ఆందోళన చేపట్టాయి. ప్రభుత్వ విధి విధానాలు పద్ధతిగా లేవని, ప్రజాసమస్యలపై పోరాటం చేసే ప్రతిపక్ష పార్టీ నేతలను అరెస్ట్ చేయడం సరికాదంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంధాని, సీఐటీయూ నాయకులునాగయ్య, హజరత్తయ్య, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం రేపు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లుగా తహసీల్దార్ ఎల్ రామ్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి అన్ని మండలాల ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలంలో మంగళవారం నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అమర్ సోమవారం తెలిపారు. 19,20,21 తేదీల్లో తూర్పుపల్లి, ఏటూరు, 22,23 తేదీల్లో పాడేరు, ఆదురుపల్లి, 28,29 పాతపాడు, వావిలేరు గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 6 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదుతో పాటు ఆధార్ అప్డేట్ సేవలను అందించనున్నట్లు వివరించారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.